క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో ఆవు మృతి

తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామంలో ప్యాదేకర్ అశోక్ అనే రైతు ఆవు శనివారం విద్యుత్‌షాక్‌తో మృతిచెందింది. తన పొలంలో ఆవు మేస్తుండగా సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్ ఎర్తింగ్ తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఆవు విలువ రూ.40 వేలు ఉంటుందని.. పరిహారం అందించి ఆదుకోవాలని బాధితుడు వేడుకుంటున్నాడు.

అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సోన్: మండలకేంద్రంలోని కేజీబీవీలో అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి లతాదేవి శనివారం తెలిపారు. తెలుగు, ఆంగ్లం, సివిక్స్, ఎకానమిక్స్, కామర్స్, ఎంపీహెచ్‌డబ్ల్యూ బోధించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు ఈనెల 11వ తేదీలోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ, బీఈడీ పూర్తి చేసిన వారు అర్హులని పేర్కొన్నారు.

పాఠశాలకు పరికరాలు



పరికరాలు చూపుతున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌కు పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకంలో భాగంగా సంగీత వాయిద్య పరికరాలు వచ్చినట్లు హెచ్‌ఎం నరేందర్‌రావు తెలిపారు. విద్యార్థులకు చదువు, ఆటలతోపాటు సంగీతంలో నైపుణ్యం పెంపొందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పీఎంశ్రీ పథకం ద్వారా మృదంగం, తబలా, డోలు, వయోలిన్ వంటి సామగ్రి పాఠశాలకు సరఫరా చేసిందని ఆయన పేర్కొన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం



విరాళం అందిస్తున్న దాతలు

ఖానాపూర్: మండలంలోని రంగపేట గ్రామంలో పురాతన రాజరాజేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలం సుంకెట గ్రామానికి చెందిన నాసాని లక్ష్మీరాజు దంపతులు రూ.50వేల విరాళం అందజేశారు. శనివారం గ్రామంలోని ఆలయం వద్ద ఆలయ కమిటీ సభ్యుల సమక్షంలో అర్చకుడికి విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని గ్రామస్తులు కోరారు.

జొన్నల కొనుగోళ్లను పొడిగించాలని వినతి

కుంటాల: అకాల వర్షాలతో జొన్న పంట కోతలు ఆలస్యమయ్యాయని.. కొనుగోళ్ల తేదీని పొడిగించాలని కోరుతూ మాజీ ఎంపీపీ అరుణ రమణారావు శనివారం హైదరాబాద్‌లో మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డిని కలిసి విన్నవించారు. జొన్నలు అమ్మిన రైతుల డబ్బులను వెంటనే తమ ఖాతాల్లో జమ చేయాలని కోరారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ సూచన మేరకు ఎండీని కలవగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు రమణారావు తెలిపారు.

బీజేపీ కార్యదర్శి పదవికి రాజీనామా

తానూరు: తన పదవికి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు బీజేపీ మండల జనరల్ సెక్రటరీ బోంతల్వాడ్ మారుతి శనివారం ప్రకటించారు. ఈమేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత నెల 18న జిల్లా కమిటీ ఆదేశాల మేరకు మండల కమిటీలో తనను పార్టీ జనరల్ సెక్రటరీగా నియమించారు. రాజీనామాను బీజేపీ మండలాధ్యక్షుడు, జిల్లా కమిటీ సభ్యులకు అందించినట్లు తెలిపారు.

25శాతం పేదలకు సీట్లు

ఖానాపూర్: మండలంలోని గోసంపల్లి గ్రామ బ్రిలియంట్ పాఠశాలలో 25 శాతం మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాబోధన చేస్తామని ప్రిన్సిపాల్ బాక నాగమొగిలి తెలిపారు. శనివారం ఆయన పాఠశాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాఠశాలలో ప్రవేశాలు ప్రారంభమయ్యాయని.. ఈనెల 27న అర్హులైన పేద విద్యార్థుల వివరాలను వెల్లడించనున్నట్లు పేర్కొన్నారు. పేద విద్యార్థులు ఆధార్, పూర్తి వివరాలతో పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన ముధోల్ల భూమన్నకు రూ.19,500 విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. శనివారం బీజేపీ నాయకులు బాధితుడి ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చిన్నారెడ్డి, బీజేపీ మండల కన్వీనర్ పసుల నవీన్, సాయిరాం, రాములు, దిగంబర్ పటేల్, శ్రీను, దినేశ్, ఆనంద్ పటేల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



భైంసాలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



లక్ష్మణచాంద: మునిపెల్లిలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కుంటాల: ఓలాలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్సై అశోక్

భక్తిశ్రద్ధలతో బక్రీద్

జిల్లాలో బక్రీద్ పండుగను శనివారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ఈసందర్భంగా ముస్లింలు ఈద్గాలు, మసీదుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రవక్త త్యాగాన్ని గుర్తు చేసుకున్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. స్వార్థం, అసూయను విడిచిపెట్టి త్యాగాన్ని వ్యాపింపజేయడమే ఈ పండుగ ఉద్దేశమని మతపెద్దలు పేర్కొన్నారు. భైంసాలో గడ్డెన్నవాగు ప్రాజెక్టు ఈద్గా వద్ద ఎస్పీ జానకీ షర్మిలతో మతపెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. పట్టణ సీఐ గోపినాథ్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



ఖానాపూర్‌లోని ఈద్గాంలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



కుభీర్: పార్డి(బి)లో చిన్నారుల ఆలింగనం



తానూరు : కోలూరులో ప్రార్థనల్లో ముస్లింలు



ముధోల్: ముస్లింలతో సీఐ మల్లేశ్, ఎస్సై పెర్సిస్



లోకేశ్వరం: రాజూర మసీద్‌లో..



సారంగపూర్ ఈద్గాంలో..

'విద్యాశాఖ నిర్లక్ష్యంతోనే అంతర్నిలో ప్రమాదం'

భైంసాటౌన్: కుభీర్ మండలం అంతర్నిలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం కూలి చిన్నారులు గాయాలపాలైన ఘటనకు జిల్లా విద్యాశాఖ అధికారులే బాధ్యత వహించాలని మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ముధోల్ డివిజన్ ఇన్‌చార్జి వినీత్ మాదిగ, ఎమ్మార్పీఎస్ డివిజన్ ఇన్‌చార్జి అంబేకర్ సంజు మాదిగ అన్నారు. ఈ మేరకు వారు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శిథిలావస్థకు చేరిన భవనం గురించి పలుమార్లు పాఠశాల ఉపాధ్యాయులు డీఈవోకు వినతిపత్రం అందించినా పట్టించుకోలేదన్నారు. విద్య, మౌలిక వసతుల కల్పనకు కేంద్రం ఏటా 60శాతం నిధులు కేటాయిస్తున్నా.. రాష్ట్రప్రభుత్వం ఖర్చు చేయకుండా తప్పుడు లెక్కలతో కాజేస్తున్నారని ఆరోపించారు. గాయపడిన చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

'ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే ఘటన'

భైంసాటౌన్: కుభీర్ మండలంలోని అంతర్ని గ్రామంలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం కూలిన ఘటనకు ప్రభుత్వం, విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని బీఆర్‌ఎస్ నియోజకవర్గ సమన్వయకర్త విలాస్ గాదేవార్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. శిథిలావస్థకు చేరిన భవనాన్ని ముందుగానే గుర్తించి కూల్చివేస్తే ఈ ఘటన జరిగి ఉండేది కాదన్నారు. గాయపడిన చిన్నారులకు ప్రభుత్వం మెరుగైన వైద్యం అందించాలని వారి కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉండాలని డిమాండ్ చేశారు.

విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలి

భైంసాటౌన్: కుభీర్ మండలం అంతర్నిలో శిథిలావస్థకు చేరిన పాఠశాల భవనం కూలిన ఘటనలో గాయపడిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని ఎస్‌హెచ్‌ఆర్‌సీ జిల్లా చైర్మన్ విక్రమ్, కన్వీనర్ సరస్వతి కోరారు. శనివారం పట్టణంలోని ఏరియాస్పత్రిలో సూపరింటెండెంట్ కాశీనాథ్‌ను కలిసి విన్నవించారు.

రెండోరోజు కొనసాగిన బడిబాట

లక్ష్మణచాంద: ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని లక్ష్మణచాంద ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజు నాయక్ పేర్కొన్నారు. శనివారం బడిబాటలో భాగంగా మండలకేంద్రంలో ఉపాధ్యాయులతో కలిసి ప్రచారం చేశారు. విద్యార్థులకు అందిస్తున్న వసతులను వివరించారు. ఉపాధ్యాయులు అశోక్, హరిప్రసాద్, హంసలత, వినోద్, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని హంగిర్గా గ్రామంలో శనివారం బడిబాట గ్రామసభ నిర్వహించారు. ఐదో తరగతి పూర్తి చేసిన విద్యార్థులను సమీపంలో ఉన్న ఎల్వి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చేర్పించాలని ఎల్వి పాఠశాల ఉపాధ్యాయులు భూమన్న యాదవ్ పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాలలో అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శంకర్, మాధవ్‌రావ్, శిరీష్‌కుమార్, గ్రామ కమిటీ సభ్యులు, విద్యార్థుల పోషకులు తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్, పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఆధ్వర్యంలో సుర్జాపూర్ పంచాయతీ పరిధి బుడగజంగంవాడలో ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్లి చిన్నారులను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని తల్లిదండ్రులను కోరారు.



లక్ష్మణచాందలో బడిబాట ర్యాలీ తీస్తున్న ఉపాధ్యాయులు



బుడగజంగంవాడలో ఉపాధ్యాయుల ప్రచారం



తానూరు : మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు భూమన్న

పోడు సాగుదారులకు పట్టాలు ఇవ్వాలి

ఖానాపూర్: గిరిజనేతరులైన పోడు సాగుదారులందరికీ ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి నూతన్‌కుమార్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి అన్నారు. శనివారం పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ప్లాంటేషన్ పేరుతో పోడు సాగుదారుల భూముల చుట్టూ పొక్లెయినర్లతో ట్రెంచ్‌లు చేయించి గుంతలు చేస్తూ విధ్వంసం సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. తర్లపాడ్ గ్రామానికి చెందిన భూమన్న, నర్సయ్య అనే గిరిజనేతరులైన పోడు భూముల్లో ట్రెంచ్ తవ్వకాలు చేపట్టి రైతులకు నష్టం చేస్తున్నారని పేర్కొన్నారు. పెంబి, కడెం మండలాల్లో పోడు భూముల్లో ప్లాంటేషన్ కోసం అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య తదితరులు ఉన్నారు.



అటవీశాఖ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

స్పందించారు.. పరిష్కరించారు



పూడ్చి వేయిస్తున్న కార్యదర్శి సాయేందర్

సాక్షి ఎఫెక్ట్..

కుంటాల: కుంటాల నుంచి దౌనెల్లి మీదుగా అంతర్రాష్ట్ర రహదారిపై పల్లె ప్రకృతి సమీపంలో బుంగ ఏర్పడగా దీనిపై ఈనెల 5న సాక్షిలో ప్రమాదకర బుంగ పూడ్చరూ..శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన దౌనెల్లి పంచాయతీ కార్యదర్శి సాయేందర్ బుంగను పూడ్చివేయించారు.

గద్దెపై ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

నర్సాపూర్ (జి): మండలకేంద్రం నుంచి కుస్లీ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. పక్కన ఎత్తు గద్దె నిర్మించినా దానిపై ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చలేదు. దీనిపై ఈనెల 5న సాక్షిలో 'ఇదో రకం నిర్లక్ష్యం'శీర్షికన కథనం ప్రచురితమైంది. స్పందించిన ఏఈ డి.శంకర్ సిబ్బంది చేత ఎక్కువ ఎత్తులో నిర్మించిన రాతి గద్దెపై ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చింపజేశారు.



రాతి గద్దెపై ఏర్పాటు చేసిన ట్రాన్స్ ఫార్మర్

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కేసులు

- నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా

ఖానాపూర్: రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే ఫర్టిలైజర్ దుకాణదారులపై కేసులు నమోదు చేస్తామని నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా అన్నారు. శనివారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రైతులు వ్యవసాయాధికారులు సూచించిన డీలర్ల వద్దే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు. రసీదులు సైతం భద్రపర్చుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలను విక్రయించినట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలని.. వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు. సమావేశంలో సీఐ అజయ్, ఎస్సై రాహుల్ గైక్వాడ్ తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏఎస్పీ రాజేశ్ మీనా

బీజేపీ పాలనలోనే సంస్కరణలు

భైంసాటౌన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 11 ఏళ్ల పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు, మరెన్నో సంక్షేమ పథకాలు అమలు చేసిందని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎస్‌ఎస్ కాటన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం నోట్ల రద్దు, 370 ఆర్టికల్ రద్దు, ఆపరేషన్ సింధూర్ వంటి సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుందన్నారు. కేంద్రం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ కార్యకర్తలకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా కృషి చేయాలని పేర్కొన్నారు. బీజేపీ నాయకులు తాడేవార్ సాయినాథ్, పట్టణ అధ్యక్షుడు రావుల రాము, అనిల్, దిలీప్, దత్తాత్రి తదితరులున్నారు.

శిథిల భవనాల కూల్చివేతకు చర్యలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో శిథిలావస్థలోగల ప్రభుత్వ పాఠశాలల భవనాల కూల్చివేతకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం కుభీర్ మండలంలోని అంతర్ని గ్రామంలో ప్రభుత్వ పాఠశాల భవనం కూలిన ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. కూల్చివేతకు అనుమతులు తీసుకున్నప్పటికీ ఇటీవలి వర్షాల కారణంగా ఆలస్యమైందని వెల్లడించారు. ఈ ఘటనలో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారని, వారిని వెంటనే ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. వారు క్షేమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తుచర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. జిల్లాలోని పలు పాఠశాలల శిథిల భవనాల కూల్చివేతకు రోడ్లు, భవనాల శాఖ నుంచి అవసరమైన అనుమతి పత్రాలు తీసుకుని తక్షణమే కూల్చివేత ప్రక్రియ చేపట్టనున్నట్లు తెలిపారు. విద్యార్థులు భద్రతాయుత వాతావరణంలో చదివేలా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేస్తోందని వివరించారు.

వ్యవసాయ పనులు ప్రారంభం



రువ్విలో పత్తి విత్తనాలు విత్తుతున్న రైతులు

ముధోల్: మండలంలోని రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. శనివారం విఠోలి, రువ్వి, ఆష్టా, ముధోల్ గ్రామాల్లో రైతులు తమ చేన్లలో సోయా, పత్తి, కందుల విత్తనాలు విత్తుతూ కన్పించారు. కురిసిన కొద్దిపాటి వర్షాలకే రైతులు ఇలా ఇలా విత్తనాలు విత్తుకుంటున్నారు. వ్యవసాయాధికారులు మాత్రం సరిపడ వర్షాలు కురిసిన తర్వాతే విత్తనాలు విత్తుకోవాలని సూచిస్తున్నారు.

అటెన్షన్ ప్లీజ్.. 'మృత్యు' గుంతలు



తానూరు: మండలంలోని ఉమ్రి(కే) నుంచి భైంసా మండలం ఇలేగాం గ్రామానికి వెళ్లే మార్గంలో ఉమ్రి(కే) వంతెన వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంత ప్రమాదకరంగా మారింది. ఈ గుంతలో వర్షపునీరు నిలుస్తుండటంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు గుంతలు పూడ్చివేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశ్నించాల్సిన అధికారి: శివలింగయ్య, పీఆర్ ఏఈ, ఫోన్: 93460 69607

మృగశిర వేళ.. చేపల వేట



కడెం: మండలంలోని కన్నాపూర్ చెరువులో శనివారం మత్స్యకారులు చేపలు పడుతూ కన్పించారు. ఆదివారం మిరుగు(మృగశిరకార్తె)కు చేపలు తినే ఆనవాయితీ కావడంతో మత్స్యకారులు వేటకు చెరువులోకి దిగారు. దీంతో సమీప గ్రామాల ప్రజలు చెరువు వద్దకే వచ్చి తాజా చేపలను కొనుగోలు చేసి తీసుకెళ్లారు.

డీసీసీ అధ్యక్షుడిని కలిసిన పాలకవర్గం

నిర్మల్‌చైన్‌గేట్: దిలావర్‌పూర్ మండలం కాల్వ గ్రామంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పాలకవర్గం శనివారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావును జిల్లా కేంద్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. చైర్మన్ మహేందర్, ధర్మకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి శనివారం భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని.. వారికి ఇబ్బందులు కలగకుండా చూడాలని నూతన పాలకవర్గానికి శ్రీహరిరావు సూచించారు.



శ్రీహరిరావుతో ఆలయ కమిటీ సభ్యులు